క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గర్భిణులకు సూచనలిస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ ప్రభావతి

కొత్తపల్లి: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రమ్య హాస్పటల్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రభావతి అన్నారు. మండలంలోని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి మాతృత్వ యోజనలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మకు పూజలు



పూజలు అందుకున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



పీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పెద్దాపురం: స్థానిక భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ పుర ప్రజలు పీఠం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నయవంచక బీజేపీని ఓడించండి



నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

పెద్దాపురం: ప్రజలను నయవంచనకు గురి చేస్తున్న బీజేపీని ఓడించాలని పట్టణ పౌర సంఘాల కార్యదర్శి సిరిపురపు శ్రీనివాస్ కోరారు. స్థానిక యాజలపు సూర్యారావు భవనంలో శుక్రవారం 'నయవంచన' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో విధ్వంసం అవుతున్న వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, పీఎస్ఎం నాయకులు కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో బైక్ ర్యాలీ

సామర్లకోట: పెద్దాపురం తెలుగుదేశం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పకు మద్దతుగా కూటమి నాయకులు శుక్రవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. సామర్లకోట నుంచి పెద్దాపురం వరకు నిర్వహించిన ర్యాలీలో రాజప్ప, జనసేన నాయకుడు తుమ్మల బాబు, బీజేపీ నాయకుడు విత్తనాల వెంకటరమణలు పాల్గొన్నారు.

స్థానికుడివైపే అందరి చూపు..

- 1985 తరువాత బరిలో దవులూరి పోటీ
- గడప గడపకూ మన ప్రభుత్వంతో నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువ
- ప్రచారంలోనూ ముందంజలోనే..



జన ప్రభంజనంలో దవులూరి ప్రచారం (ఫైల్)

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో బరిలో 10 మంది పోటీలో ఉన్నా పోటీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు, తెలుగుదేశం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప మధ్యనే ఉంటుంది. దవులూరి దొరబాబు స్థానిక అభ్యర్థిగా పోటీలో ఉండగా రాజప్ప అమలాపురం నుంచి వచ్చి మూడో పర్యాయం పోటీకి సిద్ధం అవుతున్నారు. వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న దవులూరి దొరబాబు సుమారు రెండేళ్ల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రతి గ్రామంలో పర్యటించి నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యారు. అలాగే ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఆయనకు తోడుగా తండ్రి దవులూరి సుబ్బారావు, తల్లి పార్వతి, భార్య చంద్రకళ, కుమార్తె సార్విక ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓటర్లను స్థానిక అభ్యర్థిని బలపరచాలని కోరుతున్నారు. 1985లో తెలుగుదేశం తరఫున బలుసు రామారావు స్థానిక అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి నుంచి ఏ పార్టీ కూడా స్థానికుడికి టిక్కెట్టు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికుడైన దవులూరి దొరబాబుకు పోటీ చేసే అవకాశం కల్పించారు. గత ఏడాది అక్టోబరు 12న సీఎం జగన్ సామర్లకోట వచ్చిన సందర్భంగా దొరబాబును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో అప్పటి నుంచి ప్రజల మధ్య తిరుగుతూ అందరి దృష్టినీ ఆకర్షించారు.

స్థానికతే దవులూరి బలం.. బలగం..

నియోజకవర్గానికి చెందిన వారు పోటీలో ఉంటే తమ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా అభిమానం ఏర్పడడం సర్వసాధారణం. దీనికి తోడు దవులూరి దొరబాబు 2004 నుంచి ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం ప్రయత్నం చేస్తూ టిక్కెటు వచ్చినట్లే వచ్చి చేజారి పాయేది. 20 ఏళ్ల తరువాత 2024లో దొరబాబుకు టిక్కెట్టు రావడంతో ఆయనకు ఒకసారి అవకాశం ఇవ్వాలనే సానుభూతి ఏర్పడింది. ఈ మేరకు మార్వాడి, నాయీ బ్రాహ్మణ, రజక, ఆర్యవైశ్య, బ్రాహ్మణ సంఘాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికే మద్దతు ఇచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే అయితే ప్రజలకు నిత్యావసరాలైన తాగునీరు, లైటింగ్, పారిశుధ్య సమస్యలు ఉండవని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యునిగా చెప్పుకునే వీలు ఉంటుందని వారంతా ఏకాభిప్రాయంతో ఉన్నారు.

మార్పు చేసుకోవాలి..

నియోజకవర్గంలో ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తికి రెండు పర్యాయాలు అవకాశం ఇవ్వడంతో ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. 2019లో మొదటిసారి అమలాపురం నుంచి వచ్చిన ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజప్పకు డిప్యూటీ సీఎం, హోమ్‌మంత్రి పదవులు లభించాయి. వాటిని అడ్డు పెట్టుకొని రామేశ్వరం మెట్టను గుల్ల చేసి కోట్లు సంపాదించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి అప్పట్లో తెలుగుదేశానికి అనుకూల పత్రికలో కథనం కూడా ప్రచురితమైంది. 1952లో పెద్దాపురం నియోజకవర్గం ఏర్పడిన తరువాత మూడు పర్యాయాలు ఎన్నికైన ఎమ్మెల్యే లేరు. దాంతో సెంటిమెంట్‌గా రాజప్పకు ఓటమి తప్పదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దవులూరి దొరబాబు తన చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు మున్సిపాలిటీలకు తాగునీటి సమస్య లేకుండా సుమారు రూ.కోటి విలువ చేసే వాటర్ ట్యాంకర్లను బహూకరించారు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు.

స్థానిక సంస్థలు, మహిళలు, సంక్షేమ పథకాల బలం..

రెండు మున్సిపాలిటీల్లో 60 మంది కౌన్సిలర్లు ఉండగా 58 మంది పార్టీకి చెందిన వారే. అలాగే నియోజకవర్గ పరిధిలోని 41 గ్రామాలలోను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు 95 శాతం వైఎస్సార్ సీపీకి చెందిన వారే కావడంతో, వారి సహాయంతో విజయం సులభం అవుతుందనే స్థానికులు అభిప్రాయ పడుతన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరూ అందుకున్నారు. నియోజకవర్గంలో ఓటర్లు 2,15,095 మంది ఉండగా వీరిలో పురుషులు 1,05,788, స్త్రీలు 1,09,294 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. ప్రభుత్వ పథకం మహిళల పేరునే అందడంతో మహిళలు వైఎస్సార్ సీపీకే అండగా ఉన్నారు.


దవులూరి చంద్రకళ ప్రచారం



సామర్లకోట నాల్గవ వార్డులో చంద్రకళ ప్రచారం

సామర్లకోట: పేదలకు మేలు చేయడానికి జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, తన భర్త దవులూరి దొరబాబు స్థానికునిగా ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దాపురం నుంచి పోటీ చేస్తున్నారని దొరబాబు సతీమణి, చంద్రకళ అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక నాల్గవ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మాల మహానాడు నాయకుడు లింగం శివప్రసాద్ తదితరులతో ఎన్నికల ప్రచారం చేశారు. తన భర్త స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. పట్టణ గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, ట్రస్టు బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి



నేను ఎమ్మెల్యేనైతే..

పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దవులూరి దొరబాబు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఏమి చేస్తారనే విషయంపై ప్రత్యేకంగా 'సాక్షి'తో మాట్లాడారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎమ్మెల్యేల వల్ల నియోజకవర్గంలోని సమస్యలపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో అనేక సమస్యలు దీర్ఘకాలికంగా ఉన్నాయి. స్థానికులైతే వాటిపై అవగాహన ఉంటుంది. తనను గెలిపిస్తే వాటిని సత్వరం పరిష్కరిస్తాను. దీనిలో భాగంగా సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలలోని ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్‌లకు నేరుగా ధవళేశ్వరం నుంచి పైప్‌లైను ద్వారా గోదావరి జలాలు అందిస్తాను. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన చేస్తాను. పెద్దాపురం ఏలేరు కాలువ ఆధునీకరిస్తాను. పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని పేదలకు ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తా. కాండ్రకోట దబ్బ కాలువపై కూలిపోయిన వంతెన నిర్మిస్తాను. అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుంది. ఈ సారి ఇక్కడి ఓటర్లు స్థానికతకే పట్టం కడతారని చెప్పగలను.

– దవులూరి దొరబాబు, సామర్లకోట

దోపిడీయే టీడీపీ అజెండా

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



అమినాబాద్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

కొత్తపల్లి: ప్రజలను దోచుకోవడమే టీడీపీ ప్రధాన అజెండా అని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని అమరవిల్లి, అమినాబాద్, కొత్తపల్లి గ్రామాల్లో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అడుగడుగునా పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. తమ ప్రభుత్వదం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిందన్నారు. వచ్చిపోయేవారిని ప్రజలు నమ్మరాదని, అందుబాటులో ఉండి సేవ చేసే వారినే ఎన్నుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రజలు తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచులు పులి జయబాబు, నక్కా మణికంఠ, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, నాయకులు బడే విజయకుమార్, బడే హల్లెలూయ, పెదకాపు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వంగా గీత

దొంగ హామీలతో టీడీపీ మేనిఫెస్టో

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- మాధవపట్నంలో హోరెత్తిన ప్రచారం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు మాధవపట్నం గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావుల ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన వారే పోటీ చేసేలా ప్రస్తుత ఎన్నికలల్లో ప్రతి ఒక్కరూ స్థానిక అభ్యర్థి దవులూరి దొరబాబుకు ఓట్లు వేసి తెలుగుదేశం అభ్యర్థికి డిపాజిట్లు లేకుండా చేయాలని ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా దవులూరి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా స్థానికేతరులే నియోజకవర్గంలో పాలన చేశారని, స్థానికుల దమ్ము చూపాలని ఆయన పిలుపు నిచ్చారు. పేద ప్రజలు ప్రగతి సాధించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అవినీతి లేకుండా అమలు చేశారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చేసిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయని చంద్రబాబు ప్రజలను మోసం చేయడానికి మెనిఫెస్టో హామీలు అమలు చేస్తాడా అని ఆలోచించాలన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థికి రెండో నంబరుపై, ఎమ్మెల్యే అభ్యర్థికి నాలుగో నెంబరుపై ప్రతి ఒక్కరూ బటన్ నొక్కాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అత్తిలి వెంకటసీతారామస్వామి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువ నాయకుడు మేడిశెట్టి బుజ్జి, వెంకట్రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమర్థంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

- పిఠాపురం ఈఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రామ్‌సుందర్‌రెడ్డి

పిఠాపురం: నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్ పక్రియ సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎన్నికల సిబ్బందికి ఈఆర్వో ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. పిఠాపురం మున్సిపల్ కల్యాణ మండపంలో పోలింగ్ పక్రియకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రి పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటు, తదితర విషయాలపై సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రూట్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో 242 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఈ నెల 12వ తేదీన పోలింగ్ పక్రియకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో సామగ్రి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా సిబ్బందికి సామగ్రి అందజేయాలని సూచించారు. పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారులు తనిఖీ చేయాలన్నారు. సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రూట్ అధికారులతో సమన్వయం చేసుకుని పోలింగ్ సమర్థవంతంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఓటర్లకు, సిబ్బందికి వసతులు కల్పించాలి



పెద్దాపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఈ నెల 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి, ఓటర్లకు సదుపాయలు కల్పించడంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌ఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం సెక్టార్, రూట్ తదితర అధికారులతో ఎన్నికల ప్రక్రియపై విడివిడిగా సమీక్షించారు. విధులు నిర్వర్తించే పోలింగ్ సిబ్బందికి, ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి సెక్టార్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాలను కేటాయించడం జరిగిందని, వాటి పర్యవేక్షణ బాధ్యత సెక్టార్ అధికారులపై ఉంటుందన్నారు. పోలింగ్ ప్రక్రియ రెండు రోజుల ముందు నుంచే పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద షామియానాలు, బారికేడ్‌ల ఏర్పాటు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అన్ని వసతులపై సెక్టార్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, ఏఆర్‌ఓ శ్రీనివాసరెడ్డి, డీటీ భానుకుమార్, పద్మజ, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

- ఆధ్యాత్మిక పట్టణంగా తీర్చిదిద్దుతా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత



పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున విజయం సాధిస్తే పిఠాపురం నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మూడు రోజుల్లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆమె ఎంపీగా గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, ఎమ్మెల్యేగా ఎన్నికైతే పిఠాపురం నియోజకవర్గ ప్రగతికి చేపట్టబోయే ప్రణాళికను వివరించారు. శుక్రవారం తనను కలసిన 'సాక్షి'తో ఆమె ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రతి పైసా అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు

ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికే ఖర్చు పెట్టాను. జీవిత కాలం గుర్తుండిపోయే పనులు చేసి చూపించాం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు ఇచ్చింది. అందుకే కాకినాడ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయగలిగాం. ఆధ్యాత్మిక, పారిశ్రామిక, నౌకాయాన వాడలకు నిలయమైన కాకినాడ జిల్లాలో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, లక్షల టన్నుల సరకు రవాణా జరిగే రైల్వే స్టేషన్లు ఇప్పటివరకూ అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయాయి. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక ఆయన చొరవతో కాకినాడ ఎంపీగా జిల్లాలో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేశాను. సుమారు రూ.250 కోట్ల వరకూ నిధులు విడుదల చేయించి అతి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపించాం. ఇప్పటివరకూ విడుదలైన ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశాం.

రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు ఇలా..

- కొత్తగా నిర్మించిన ఆర్‌యూబీలు – 4, (గోర్స, మాధవపురం, హంసవరం, తుని)
- ఆర్‌యూబీల నిర్మాణానికి వెచ్చించిన నిధులు – రూ.22 కోట్లు
- పిఠాపురంలో ఉప్పాడ సెంటర్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి నిధులు –రూ.150 కోట్లు

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి – రూ 2.21 కోట్లు

- తుని రైల్వే స్టేషన్‌లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి – రూ.2.35 కోట్లు
- మేడపాడు రైల్వే స్టేషన్లో ప్లాట్‌ఫాం నిర్మాణానికి – రూ.2.10 కోట్లు
- పిఠాపురం, రావికంపాడు, గొల్లప్రోలులో షెడ్లు నిర్మాణానికి – రూ 2.49 కోట్లు
- చేబ్రోలు–దువ్వాడ మధ్య రైల్వే ఆర్వోప్లాంట్లు నిర్మాణానికి – రూ.2.32 కోట్లు
- సామర్లకోట రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు – రూ.11 కోట్లు

తీర ప్రాంత రక్షణకు చర్యలు తీసుకుంటాం

ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో పలు పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటన్నిటినీ మరింత అభివృద్ధి చేసి అధునాతన సౌకర్యాలు కల్పించి ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా చేస్తా. ఇప్పటికే పిఠాపురం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేశాం. పిఠాపురం–ఉప్పాడ రేల్వే గేటు ప్రధాన రహదారిలో ఉండడంతో ఇక్కడ రేల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతులు ఇవ్వడంతో పనులు ప్రారంభించారు. ఇప్పటికే రూ.45 కోట్లు విడుదల చేశారు. మరో రూ.15 కోట్లు అదనపు నిధుల కోసం విజ్ఞప్తి చేయగా ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తాం. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం పలు ప్రధాన రైళ్లకు పిఠాపురంలో హాల్టు కల్పించాం. పిఠాపురాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాం. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాం. ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే తీరానికి మణిహారంగా మేజర్ హార్బర్ నిర్మించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేసి తీర ప్రాంతాన్ని మరో ముంబాయిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తాను.

చీకటి బతుకుల్లో వెలుగులు

- మత్స్యకార కుటుంబానికి మార్గం చూపిన నవరత్నాలు
- జగనన్న పాలనలో మారిన జీవితాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



నా పెద్ద కొడుకు సీఎం జగన్ మా బతుకులు మార్చారని చెబుతున్న కామేశ్వరమ్మ

పిఠాపురం: సముద్రంలో చేపలను వేటాడితే గాని పూట గడవని కుటుంబం అది. తల్లి, తండ్రి, ముగ్గురు కుమార్తెలతో ఒక నిరుపేద సంసారం. చేపల వేట లేకపోతే ఆ కుటుంబంలో వారంతా పస్తులతో గడపాల్సిందే. కడలిపైనే భారం వేసి సంసార సాగరాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రకృతి వైపరీత్యం వచ్చిందంటే చాలు చేపల వేట ఆగిపోయి ఇక ఆ కుటుబంలో వారికి తిండి ఉండేది కాదు. పండుగలు, పబ్బాలు అంటే తెలియని దీనస్థితి వారిది. కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన చోడిపల్లి ఈశ్వరరావు చిన్న నాటి నుంచి పోలియోతో ఒక కాలు సరిగా పని చేయని దివ్యాంగుడు. అయినప్పటికీ కుటుంబ పోషణ కోసం చేపల వేటకు వెళ్లేవాడు. అనుకోకుండా ప్రమాదానికి గురై పోలియో ఉన్న కాలు దెబ్బతినడంతో ఇక వేటకు వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. ఒక పక్క పని లేక, మరోపక్క ఆదాయం రాక పస్తులుండే పరిస్థితిలో ముగ్గురు కుమార్తెలను చదివించి తనలా వారు పేదవారిగా ఉండకూడదనుకునే అతని ఆశ అడియాశగా మిగిలిపోయింది. పూట గడవక పెన్షన్ కోసం జన్మభూమి కమిటీల వద్దకు కాళ్లరిగేలా తిరిగేవాడు. కాని ఫలితం లేకుండా పోయింది. రోజు తమ వద్దకు తిప్పుకుని సమాధానం కూడా చెప్పేవారు కాదు. చేపల వేట తప్ప మరో పని రాని ఈశ్వరరావు ఇక తన జీవితాలు మారవని తనలో తానే కుంగిపోయేవాడు.

2019 నుంచి జీవితంలో వెలుగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత వారి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. ప్రభుత్వం మారినా ఏ జరుగతుందిలే అనుకున్న తరుణంలో వలంటీర్ వారి ఇంటికి వచ్చి వారి పరిస్థితిని రాసుకుని వెళ్లిన తరువాత కుటుంబం స్వరూపం ఒక్కసారిగా మారిపోయింది. ఎవరినీ అడగకుండానే ఈశ్వరరావుకు రేషన్‌కార్డు, దివ్యాంగ పింఛన్ మంజూరయ్యాయి. ఇప్పటివరకూ రూ 1.52 లక్షలు పెద్ద కుమార్తెకు ఫీజు రియింబర్స్‌మెంట్. రెండో కుమార్తెకు జగనన్న విద్యావిద్యా దీవెన, వసతి దీవెన, చిన్న కుమార్తెకు అమ్మఒడి రూపంలో రూ.1.50 లక్షల వరకు వచ్చింది. స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం, ఇల్లు కట్టుకోడానికి రూ.2 లక్షల రుణం రావడంతో ఇల్లు కట్టుకున్నారు. ఈశ్వరరావు తండ్రి బాగిర్తికి వృద్ధాప్య పింఛన్, తల్లి కామేశ్వరమ్మకు ఇంటి రుణం రూ.2 లక్షలు, చేయూత పథకంలో రూ.37,500 అందుకున్నారు. పూట గడవని ఆ కుటుంబానికి ఒక్కసారిగా అంత ఆర్థిక సహాయం అందడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. దివ్యాంగుడైన ఈశ్వరరావు అప్పటివరకు ఏపని చేసుకుందామన్నా పెట్టుబడి లేక చేయలేక పోగా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడంతో కళ్ల జోళ్ల వ్యాపారం ప్రారంభించాడు. తన కుమార్తెలు ముగ్గురు చదువుకుంటూ ప్రయోజకులు అవుతుంటే ఆ తండ్రి ఆనందం వర్ణనాతీతం. మా బతుకులు మార్చమని దేవుని కోరుకున్నా... ఆ దేవుడు మా కోరికలు తీర్చుతాడో లేదో తెలియదు కాని మా కళ్ల ముందు కనిపించే మా ఇంటి ఇలవేల్పు మాత్రం సీఎం జగనే అంటూ ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది.



కళ్లజోళ్ల వ్యాపారం చేసుకుంటున్న ఈశ్వరరావు